ఏదో మెఱుపు అప్పుడప్పుడు మెఱుస్తుంది.

ఒకరోజున కోనేటి మెట్లమీదకూచొని, పాచి నీటిలో నీడ చూసుకో ప్రయత్నిస్తూ అవధానితో అన్నాడు.

"చచ్చిపోయినవాళ్లు బూడిదై పోతారు ?

"ఎందుకవుతారు వూరికెనే? బతికున్నవాళ్లు కాల్చేస్తే అవుతారు"

"తంతే సరి వెధవల్ని"

"ఎందుకు—?"

"మరి వాళ్ళను కాల్చటం దేనికి? గాడిదెలు!!" అవధానికిగూడా యీ ప్రశ్న అర్థం కాలేదు.

కొంచెంసేపటికి నారాయణ మళ్ళీ మాట్లాడాడు.

"మనిద్దరం వారాలుచేసుకొని చదువుకుందాం వస్తావా?"

"రాను..."

"ఎందుకని?"

"వారాలు నాకెందుకు? బీదవాళ్ళకుగాని"

"తంతా నిన్ను!"

"మళ్ళీ తంతా నిన్నే!"

నారాయణ లేచి అవధాన్లను రొండు వేశాడు.

"వారాలు చేసుకోవూ?" అని యింకోటి వేశాడు.

నాన్నగారు ఆ రాత్రి కంపెనీనుండి తిరిగి వచ్చినతర్వాత అవధాన్లకు తను వేసిన ఆట్లన్నీ, తిరగ బడ్డయ్ తనమీదనే.

"రేపట్నించీ మళ్ళీ బళ్ళోకిపో...వెధవాయ్!" అని నాన్నగారన్నాడు.

* * *

నారాయణ బడికి మొదటిసారి వెళ్ళాడు. గారాబంచేసి పెంచిన నాయనమ్మ లేని ఫలితాల్లో యిదొకటి. అందరికన్నా ముందే అక్షరాలూ, గుణింతమూ,మాటలూ నేర్చుకొన్నాడు. కాని వుత్సాహమేమీ లేనిచదువు.

"ఏదో తిన్నాడు"

"వి...షం..."

"అప్పులు...ముంచేసినై"

"అందర్నీ నమ్మాడు......మెడకు తెచ్చుకున్నాడు"

పదిరోజుల్లో అమ్మరూపు మారిపోయింది. చుట్టాలంతా వెళ్ళిపోయారు. ఒకరోజున ఒక పెద్దమనిషి వచ్చి "ఆయనగారి యిన్సూరెన్సేమీ రాలేదు. ఆత్మహత్యకింద తేల్చారు" అన్నాడు తలుపుచాటున వున్న అమ్మతో.

"అయ్యో! మా ఆశలన్నీ దానిమీద వున్నవి అన్నగారూ!" అని అమ్మ వాపోయింది.

"కంపెనీ అంతా రామమూర్తి తీసుకుంటున్నాడు. అన్ని పత్రాలు సృష్టించుక్కూచొన్నాడు వెధవ. బ్యాంకీవాళ్ళు యిల్లు వేలానికి తెస్తున్నారు" అని చెప్పి ఆ పెద్దమనిషి మాయమైపోయాడు. ఆయన అమ్మ పెత్తల్లికొడుకు.

*   *   *

అమ్మ-వాళ్ళకూ, వీళ్ళకూ కబుర్లు చేసింది. నారాయణ కక్కయ్యలు ముఖం తప్పించేశారు. నాన్నచుట్టూ తిరిగి ప్లీడరుపని సాగించిన సుబ్బారావు, కాళిదాసు పంతులూ, నరశింగరావుగూడా రాలేదు. నాన్నదగ్గర చేబదుళ్ళు తీసుకొన్న కోనంగి గూడా (సబు రిజిష్ట్రారు ఆఫీసుముందు కూర్చొని తప్పుడుపత్రాలు వ్రాసే చెట్టుకింద ప్లీడరు కోనంగి). నాన్న డబ్బుతో చైర్మెన్ అయిన సీతారామశాస్త్రి అసలే రాలేదు. నారాయణకు యీ సంగతులేమీ తెలియవు. అమ్మ యితర్లతో అని, కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంటే విన్న విశేషాలు యివన్నీ.

అమ్మ తమ్ముడు-మామయ్యమాత్రం-వచ్చాడు.

"యిక వీడి చదువు సంగతి చూడాలిగాని పోయిన ఆయన తిరిగి రాడుగదా!'' అని మామయ్య.

రోగపు కులటల వరండాలేని రేకు యిళ్ళల్లో నిద్రించి - నారాయణ యువకుడైనాడు.

బొంబాయిలో - బెజవాడలో తను వదిలిన చదువుకొరకైన దిగులుపోయి - పూర్తి విజ్ఞానం సముపార్జించ గలిగాడు. బట్టలమిల్లుల్లో కూలీలు సమ్మెలు చేస్తున్నప్పుడు వాళ్ళ నడుములు విరగగొట్టి రహస్యంగా ఆకాశంనుంచి రాలిపడ్డ పదిరూపాయిలనోట్లు సంపాదించాడు. పోర్చుగీసు డామన్ వెళ్ళి ఆకాశంలో చుక్కలూ, ప్రశాంతీలేని రాత్రిళ్ళు సముద్రం మీద చిన్న దోనెల్లో విదేశీ సారాసీసాలు దొంగిలించుకువచ్చి, యింగ్లీషు హోటళ్ళలో ఫులెన్ సూట్ల పెద్దమనుషులకు అందించి చౌకగా డబ్బు సంపాదించాడు. బొంబాయిలో అతన్నెరగని రౌడీలు లేరు (అక్కడ దాదాలంటారు.) గోవావెళ్ళి బంగారపు అచ్చులు బొంబాయి మార్వాడీ షావుకార్లకు అందజెయ్యాలంటే ఏమి చెయ్యాలో నారాయణ ఆలోచించ నక్కర్లేదు. గోల్‌పీఠా కుళ్ళుబజార్లలో కలహం రేపాలంటే గుక్క మంచినీళ్ళ ప్రాయం. మదన్‌పురా మురికి కొంపల్లో, ఖెండీ బజార్ స్లమ్స్‌లో, పరేల్ మిల్లుల్లో దాదర్ వత్తిడిలో, బైకుల్లా కంపులో - యిక్కడా అక్కడా ఏమిటి? - బొంబాయి గుడ్డల మిల్లుల గుజరాతీ షావుకార్లు సృష్టించిన అన్ని నరకపు పేటల్లోనూ అతనికి స్నేహితు లున్నారు? చీకట్లో నించొని, బొంబాయి రోడ్లమీద షికార్లు పోతున్న భార్యా భర్తల్ని దోచటం, ఆఫ్‌గన్ పఠాన్లతో కలిసి చిన్న బ్యాంకుల్లోకి జొరబడటం, విదేశాలనించి వచ్చే నావికుల దగ్గర తెలివిగా దొంగ పిస్తోళ్ళు బేరం చేయటం - ఒకనాటి వారాల పిల్లవాడికి, నాయనమ్మకోసం కాశీమజిలీ కథలకోసం,సంజీవి పుల్లకోసం వెతికిన నారాయణకు కూసు విద్య ఐపోయింది. కాని నారాయణ ఒక విషయంలోనే పొరబాటు చేశాడు. తనే తెలివిగలవాడినని, తన దొంగ పిస్తోలు ముందు, స్ప్రింగు పేష్ కత్తిముందు - లోకానికి మోక్షం యివ్వదలిచాడు. కాని తనకు మోక్షం యివ్వదలచిన పోలీసుల సంగతి బొత్తుగా మరిచిపోయాడు.

